క్లుప్తంగా...

జేజీఆర్ ఉన్నత పాఠశాలలో మదర్స్‌డే వేడుకలు



మదర్స్‌డే వేడుకల్లో గంగరాజు, ఉపాధ్యాయులు

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల నిర్వాహకులు గంగరాజు తల్లి జంగా లక్ష్మిని ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లవి మోడల్ స్కూల్‌లో 100శాతం ఉత్తీర్ణత

బోడుప్పల్: సీబీఎస్ఈ బోర్డు విడుదల చేసిన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో బోడుప్పల్ పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ సుశీల్ కుమార్ వెల్లడించారు. బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 98.6 శాతం ఉత్తీర్ణతతో బి.శ్రీహర్ష స్కూల్ టాపర్‌గా నిలిచినట్లు వెల్లడించారు. అలాగే 97.0శాతం ఉత్తీర్ణతతో ఎ.అద్భుత రెండవ స్కూల్ టాపర్‌గా, 97.6 శాతం ఉత్తీర్ణతతో హేమంత్‌రాజ్ కె.అభిజిత్‌రెడ్డి మూడవ స్కూల్ టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సుశీల్‌కుమార్, ప్రిన్సిపాల్ తనూజ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఐపీఎల్ నేపథ్యంలో క్విజ్

సాక్షి, సిటీబ్యూరో: ఐపీఎల్ పోటీలు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో ఆన్‌లైన్ స్పోర్ట్స్‌వేర్ బ్రాండ్ పరిమ్యాచ్ స్పోర్ట్స్.. క్రికెట్ ప్రేమికుల కోసం ఓ క్విజ్ పోటీ ప్రారంభించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం ద్వారా లేదా నగరంలోని మాల్స్‌లో తాము ఏర్పాటు చేసిన ఫొటోబూత్‌లో అభిమాన క్రికెటర్ బొమ్మతో దిగిన సెల్ఫీని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం ద్వారా రెండు రకాలుగా పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు.

మహిళ అదృశ్యం



సబ్రీనుభాను(ఫైల్)

మేడిపల్లి: ఓ మహిళ అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం పీర్జాదిగూడ మానసనగర్ కాలనీలో నివాసం ఉంటున్న సబ్రీనుభాను(32) హౌస్ వైఫ్. శనివారం సాయంత్రం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ



జవహర్‌నగర్: సోదరి పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు ఇంటిని లూటీ చేశారు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాప్రా సాకేత్‌లో చోటుచేసుకుంది. జవహర్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ వివరాల ప్రకారం.. కాప్రా జమ్మిగడ్డలోని సాకేత్ కాలనీ ఫేస్–1లో కె.రామసుబ్బ నర్సింహశాస్త్రీ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తాజ్‌క్రిష్ణలో తన సోదరి రిసెప్షన్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. అర్ధరాత్రి ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డితో పాటు డీఐ మధుకుమార్ వచ్చి సీసీ పుటేజీలను పరిశీలించి క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు. 5 తులాల బంగారు ఆభరణాలు, 2 కేజీల వెండి ఆభరణాలు, 3 ల్యాప్‌టాప్‌లు అపహరణకు గురైనట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఏళ్ల కల.. సాకారమయ్యే వేళ..

- ఎట్టకేలకు కల్వర్టు నిర్మాణానికి మోక్షం
- రూ.1.45 కోట్లతో నిర్మాణ పనులు
- పనులు ప్రారంభంతో ట్రాఫిక్ ఆంక్షలు
- రెండున్నర నెలలు దారి మళ్లింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు





కాప్రా-ఎల్లారెడ్డిగూడ మార్గం దాబాగార్డెన్ సమీపంలో ఇరుకైన కల్వర్టు

కాప్రా: ఎట్టకేలకు కాప్రా–ఎల్లారెడ్డిగూడ మార్గంలోని దాబాగార్డెన్ వద్ద కల్వర్టు పనులు ప్రారంభమయ్యాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వాహనదారులు, స్థానికుల కల సాకారమవుతోంది. ఇరుకైన, శిథిలావస్థకు చేరిన కల్వర్టుపై సాక్షి వరుస కథనాలతో ఎన్నోసార్లు అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన అధికారులు పనులు ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు మూడు నెలల్లో కల్వర్టు నిర్మాణం పూర్తయ్యి రాకపోకలకు అందుబాటులోకి రానుంది.

రూ.1.45 కోట్లతో కల్వర్టు నిర్మాణం

కాప్రా చెరువు నాలాపై దాబాగార్డెన్ సమీపంలోని కల్వర్టు నిర్మాణం కోసం పనులు ప్రారంభమయ్యాయి. రూ.1.45 కోట్లతో చేపట్టిన ఈ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ప్రస్తుతం నాలా నీటిని మళ్లించేందుకు పైప్‌లైన్ పనులు మొదటగా ప్రారంభించారు. అనంతరం కల్వర్టు నిర్మాణ పనులు మొదలుపెట్టనున్నారు. 20–15 వెడల్పుతో నిర్మించే ఈ కల్వర్టు దాదాపు రెండున్నర నెలల్లో అందుబాటులోకి రానుంది. 100 మీటర్ల వెడల్పు గల ఈ రోడ్డు మార్గంలో నాలాపై వాహనాల రాకపోకల కోసం 20 మీటర్ల రోడ్డును నిర్మించనున్నారు. అనంతరం ఇరువైపులా సుమారు 50 మీటర్ల చొప్పున సీసీ రోడ్డును ఏర్పాటు చేసి వాహనదారుల రాకపోకలకు మార్గం సుగమం చేయనున్నారు.

ఏళ్ల కల సాకారం..

30 ఏళ్ల క్రితం 1991 ఏడాదిలో నాటి మున్సిపల్ బండారి రాజిరెడ్డి హయాంలో కాప్రా చెరువు నాలాపై నుంచి రాకపోకలను సుగమం చేసేందుకు ఈ కల్వర్టును నిర్మించారు. రోజురోజుకూ విస్తరించిన నగరం, పెరిగిన జనాభాతో వాహనాల రద్దీ కూడా పెరిగింది. దీంతో నాటి అవసరాలకు అనుగుణంగా నిర్మించిన కల్వర్టు ప్రస్తుతం ఇరుగ్గా మారింది. దానికి తోడు శిథిలావస్థకు కూడా చేరుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేసేవారు. ప్రస్తుతం నిర్మాణ పనులు ప్రారంభంకావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు..

కల్వర్టు నిర్మాణంతో ఆ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు ప్రారంభంకానున్నాయి. కాప్రా, ఎల్లారెడ్డిగూడ, వంపుగూడ వెళ్లే వాహనాల దారి మళ్లించనున్నారు. దాదాపు రెండున్నర నెలలు ఈ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. వాహనాల రాకపోకలు దారి మళ్లించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు ట్రాఫిక్ పోలీసులకు లేఖ రాసినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. నిర్మాణం పూర్తయ్యే వరకు ట్రాఫిక్ ఆంక్షలు, దారి మళ్లింపునకు వాహనాదారులు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

ఉద్యమకారుడికి పరామర్శ

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నేత రమేష్ చారిని ఆ పార్టీ సీనియర్ నాయకులు, బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారు లక్ష్మారెడ్డి పరామర్శించారు. కొన్ని రోజులు అనారోగ్యంతో బాధపడుతున్న రమేష్‌చారి విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ ఆదివారం వారి నివాసానికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తనకు అండగా ఉన్నానని ధైర్యం చెబుతూ ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బీఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు భైరి నవీన్‌గౌడ్, మహేష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బేతాళ బాలరాజు, శ్రీశైలం, జంపాల్‌రెడ్డి, ముత్యం తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమకారుడు రమేష్‌చారిని పరామర్శిస్తున్న బండారి లక్ష్మారెడ్డి

పరామర్శ

కాప్రా: శ్రీరామ్‌నగర్ కాలనీ అధ్యక్షుడు చంద్రమౌలిని నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పరామర్శించారు. ఇటీవల గుండె సంబంధిత చికిత్స చేయించుకుని, ఆస్పత్రి నుంచి చంద్రమౌళి డిశ్చార్జ్ అయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ మేయర్ రామ్మోహన్ వారి నివాసానికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు రేగళ్ల సతీష్‌రెడ్డి, నాయకులు మచ్చ చంద్రమౌలిగౌడ్, బాలనర్సింహ, వంశరాజ్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రమౌళిని పరామర్శిస్తున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్

అభివృద్ధికే ప్రాధాన్యం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ విహారిక సీ సెక్టార్ కాలనీ అసోసియేషన్ సాధారణ సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో జరిగిన అభివృద్ధి, అవసరమైన పనులపై చర్చించారు. అనంతరం కాలనీవాసులు రాంకోటి నాయక్, నాగార్జున, యాదగిరి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, కార్యదర్శి రాజ్‌కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన కాలనీవాసులను సన్మానిస్తున్న కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి

నేటినుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

- 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో క్రీడలు
- జిల్లాస్థాయిలో 22 నుంచి 24 వరకు పోటీలు
- కలెక్టర్ చైర్మన్‌గా జిల్లాస్థాయిలో క్రీడల కమిటీ
- ఎంపీపీ చైర్మన్‌గా మండల స్థాయిలో కమిటీలు



సాక్షి, మేడ్చల్‌జిల్లా : తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు సీఎం కప్ పేరుతో మండల స్థాయి, జిల్లాస్థాయిలో క్రీడలను నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. క్రీడల నిర్వహణ, విజయవంతం చేసేందుకు జిల్లాస్థాయిలో కలెక్టర్ అమయ్‌కుమార్ చైర్మన్‌గా జిల్లాస్థాయి క్రీడల కమిటీ ఏర్పాటైంది. అలాగే, మండల స్థాయిలో ఎంపీపీ చైర్మన్‌గా మండల స్థాయి క్రీడల కమిటీలను ఏర్పాటు చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 5 మండలాల్లోనే క్రీడలు నిర్వహిస్తారు. ప్రతీ మండలంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు పక్కా కార్యాచరణ ప్రణాళికతో జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది.

నేటినుంచి మండల స్థాయిలో..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో శామీర్‌పేట్, కీసర, ఘట్‌కేసర్, మేడ్చల్, మూడుచింతలపల్లి మండల కేంద్రాల్లో సోమవారం నుంచి 17 వరకు నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడాపోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండల స్థాయిలో అథ్లెటిక్స్(మహిళలు/పురుషులు), ఫుట్‌బాల్(పురుషులు), కబడ్డీ (మహిళలు/ పురుషులు), ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రీడలను విజయవంతం చేసేందుకు మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీల్లో ఎంపీపీ చైర్మన్‌గా, ఎంపీడీఓ కన్వీనర్‌గా ఉంటారు. సభ్యులుగా జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంఈఓ/గజిటెడ్ హెడ్‌మాస్టర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఫిజికల్ డైరెక్టర్/పీఈటీలు ఉంటారు. మండల స్థాయిలో గెలుపొందిన విజేతలకు మెరిట్ సర్టిఫికెట్స్ అందజేస్తారు. ఈ క్రీడా పోటీల్లో 15 నుంచి 36 సంవత్సరాలు వయస్సు ఉన్న పురుషులు/మహిళలు పాల్గొనాల్సి ఉంటుంది. మండల స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు ప్రభుత్వం ప్రతి మండలానికి రూ.15 వేలు కేటాయించారు. మండల స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారుల జాబితాను సంబంధిత కమిటీలు ఈ నెల 18 వరకు జిల్లా యువజన, క్రీడలశాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని ఆ శాఖ అధికారి బి.బలరామారావు తెలిపారు.

ఈనెల 22 నుంచి జిల్లాస్థాయి క్రీడలు

మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు ఈ నెల 22 నుంచి 24 వరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా స్థాయి క్రీడా పోటీలు 11 విభాగాల్లో నిర్వహించనున్నారు. పోటీలను హకీంపేట్‌లోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి మెరిట్ సర్టిఫికెట్ అందజేస్తారు. పాల్గొన్న క్రీడాకారులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందిస్తారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను ఈ నెల 29 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన మొదటి విజేతకు రూ.లక్ష, రెండో విజేతకు రూ.75 వేలు, మూడవ విజేతకు రూ.50 వేలు అందజేస్తారు. అలాగే వ్యక్తిగత క్రీడాంశంలో మొదటి విజేతకు రూ.20 వేలు, రెండవ విజేతకు రూ.15 వేలు, మూడవ విజేతకు రూ.10 వేలు నగదు రూపంలో సీఎం కప్‌తోపాటుగా అందజేస్తారు. జిల్లా స్థాయిలో క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల వయస్సు ధృవీకరణ పత్రం లేదా 10వ తరగతి మెమో, ఆధార్ కార్డును తప్పని సరిగా అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని జిల్లా యువజన, క్రీడలశాఖ పేర్కొంది.

విద్యార్థికి నగదు ప్రోత్సాహకం

బోడుప్పల్: 10వ తరగతి వార్షిక ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి ఆ పాఠశాల కరస్పాండెంట్ కె.రాంచంద్రారెడ్డి నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఇందిరానగర్ కాలనీలోని న్యూటన్ గ్రామర్ హైస్కూల్ 2022–23 సంవత్సరంలో ఆ పాఠశాల విద్యార్థి బి.అరవింద్‌గౌడ్ 10/10 జీపీఏ సాధించాడు. ఆయనకు ఆదివారం కరస్పాండెంట్ రాంచంద్రారెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థితిలో ఉండేందుకు ప్రణాళికలు రూపొందించుకుని, ఆ దిశగా అడుగులు వేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జులు జయశ్రీ, మిస్బరాణి, లూసి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థికి నగదు ప్రోత్సాహకం అభినందిస్తున్న కె.రాంచంద్రారెడ్డి

బస్తీదవాఖానా పనులను పరిశీలించిన కమిషనర్



బస్తీ దవాఖానా పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వాణిరెడ్డి

బోడుప్పల్: 12వ డివిజన్‌లో నూతనంగా నిర్మిస్తున్న బస్తీ దవాఖానా పనులను ఆదివారం కమిషనర్ ఎ.వాణిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతి పది వేల మందికి ఒక బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ బస్తీ దవాఖానాల పనులను త్వరితగతిన పూర్తిచేసి అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామన్నారు. ఒక డాక్టర్, స్టాఫ్ నర్సు, ఒక నర్సుతో పాటు మందులు, రోగ నిర్ధారణ పరీక్షలతోపాటు ప్రాథమికంగా చికిత్సలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, కాలనీవాసులు అంజయ్య, మల్లేష్, మధు, గౌడిశాల శ్రీనివాస్‌గౌడ్, యాకుబ్, శంకర్, సత్యం, అరవింద్‌గౌడ్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి



మచ్చబొల్లారం అంబేద్కర్‌నగర్‌లో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్

అల్వాల్: అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మచ్చబొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. ఆదివారం మచ్చబొల్లారంలోని అంబేద్కర్‌నగర్‌లో మాల జంగం, మహేశ్వర సంఘం నూతన కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మాల జంగం వారికి రావాల్సిన హక్కుల కోసం కలిసి పోరాడి సాధించుకుందామన్నారు. సంఘం అధ్యక్షుడు పి.కోటేశ్వర్, ప్రధాన కార్యదర్శి విష్ణునాథ్, శివరామకృష్ణ, రాజ్‌కుమార్, కృష్ణ, మాదరి ఉమాపతి, నాయకులు సురేందర్‌రెడ్డి, అనిల్‌కిషోర్, శ్రీశైలం యాదవ్, శ్రావణ్, పరమేష్, శకుంతల నాయుడు, సులోచన, పవన్‌కుమార్, వినోద్, యోగేష్, విశ్వనాథ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు

ఉప్పల్: ఉప్పల్ డీఎస్ఎల్ మాల్‌లో ఆదివారం టాటా టీగోల్డ్ ఆధ్వర్యంలో మాతృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టాటా టీగోల్డ్ వినియోగదారుల సమక్షంలో మాతృ దినోత్సవ వేడుకలు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. మరుపురాని అనుభవాలను ఒకరి నుంచి ఒకరు పంచుకున్నారు. ప్రపంచంలోని తల్లి ప్రేమను మించిన ప్రేమ లేదని అందుకు మాతృ ప్రేమను గుర్తు చేస్తూ నూతనంగా «మై టర్న్ టు కేర్» నినాదంతో టాటా టీగోల్డ్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహించిన చాయ్‌పే చర్చ తదితర కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన టాటా కన్స్యూమర్ ప్రోడక్ట్స్ ప్యాకేజ్ బేవరైజస్ అధ్యక్షుడు పునీత్‌దాస్ మాట్లాడుతూ టాటా టీ గోల్డ్ కేర్ ప్రచారం తల్లీబిడ్డల బంధాన్ని మరింత ధృడపరస్తుందని తెలిపారు.

లోతట్టు ప్రాంత సమస్య పరిష్కరించాలి

మల్లాపూర్: చాణక్యపురి కాలనీ లోతట్టు ప్రాంతం కావడంతో డ్రైనేజీ, రోడ్ల సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఆదివారం స్థానిక కాలనీవాసులు కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డిని కలిసి సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. చాణక్యపురి కాలనీ లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం కురిసినప్పుడల్లా రోడ్లపై వరద, డ్రైనేజీ చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. కొన్ని రోజులుగా వర్షంతో సంబంధం లేకుండానే మురుగు రోడ్లపై చేరి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతోంది. మురుగుతో ఎక్కడ రోగాలబారిన పడతామోనని భయంగా ఉన్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చాణక్యపురి కాలనీవాసులు

ఉచిత వైద్య శిబిరం

తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ సంక్షేమ సంఘం, సీఎస్‌సీ హెల్త్‌లో ఆధ్వర్యంలో సుభాష్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ప్రారంభించి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగ కార్మికులకు వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, హెల్త్ కార్డుల నమోదు ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో నిర్మాణ రంగ సంఘం నేతలు చిగుళ్ల శ్రీనివాస్, సాయిలు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక సందడి

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశ్రీ డాన్స్ అకాడమీ గురువు సుష్మ ఉదయ్, కళానిధి డాన్స్ అకాడమి గురువు లహరి సంజీవ్ శిష్య బృందంచే నిర్వంచిన కూచిపూడి నృత్యం, పుష్పాంజలి, గణనాధమ్ జయజయ వైష్ణవి దుర్గే తదితర అంశాల్లో కళాకారులు నృత్య ప్రదర్శన చేసి మెప్పించారు.



హబ్సిగూడలో శ్రీరామ ఆలయంలో వంటశాల, కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



ఉప్పల్ అభయాంజనేయ స్వామి ఆలయంలో కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

ఘనంగా హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతిని అన్ని ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొనగా వారి కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ఎటు చూసినా ఆధ్యాత్మిక వాతావరణమే కనిపించింది. ఎండ తీవ్రత ఎక్కువ ఉండటంతో ఆలయాల్లోని చలువ పందిళ్లలో భక్తులు సేదతీరారు. ఆయా ఆలయాల నిర్వాహకులు అన్నదానాలు చేయడంతో పాటు తాగునీటి వసతి కల్పించారు.



అల్వాల్ బాలాజీ ఆలయంలో పూజలు



మల్లికార్జునగర్‌లోని మల్లన్న ఆలయంలో హోమం



మల్లికార్జునగర్‌లోని మల్లన్న ఆలయంలో బీజేపీ నేత జిల్లెల రవియాదవ్